క్లుప్తంగా

ఘనంగా తెలుగు వెలుగు సాహిత్య వేదిక వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న తెలుగు వెలుగు సాహిత్య వేదిక సభ్యులు

బొబ్బిలి: పట్టణంలోని సాహితీనగర్‌లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక మూడో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీఆర్ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, తెలుగు భాషాభివృద్ధికి సంస్థ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. గత రెండేళ్లలో ఎంతోమంది కవులు, రచయితలు, భాషాభిమానులను ఒకేతాటిపైకి తీసుకువచ్చి, కవితా చర్చలు, కవితా గోష్ఠులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పుల్లెల శ్రీనివాసరావు, అల్లు అప్పలనాయుడు, పక్కి రమేష్‌కుమార్, కురమాన రామకృష్ణ, పట్నాయకుని వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి



చాటాయివలసలో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

రేగిడి: విత్తనాలు కావాల్సిన రైతులంతా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ఆమదాలవలస, దేవుదళ, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం, చాటాయివలస తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటపొలం వివరాలు, రైతుల ఆధార్‌కార్డు నంబర్‌ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్న సాగు సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



చిన్నారుల ఆరోగ్యం తనిఖీ చేసి, మందులు వేస్తున్న సిబ్బంది

రేగిడి: గర్భిణులు, చిన్నారులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోహినీరాఘవ్ తెలిపారు. మండలంలోని వండానపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్య తనిఖీలు చేసి, మెరుగైన ఆరోగ్యానికి సూచనలు, సలహాలను ఆమె ఇచ్చారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



రాణావీధిలో పాడైన తాగునీటి బోరును బాగుచేస్తున్న మెకానిక్‌లు

రాజాం సిటీ: పట్టణంలో ఏర్పడిన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తాగునీటి బోర్లు మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. తరచూ తాగునీటి పైపులైన్ పాడవ్వడంతో పాటు సంకిలి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు పట్టణంలో పాడైన బోర్లును గుర్తించి, వాటిని బాగుచేయిస్తున్నామన్నారు. స్థానిక రాణా వీధిలోని బోరును మెకానిక్‌లు శ్రీనివాస్, సత్యనారాయణ, అప్పలరాజులు గురువారం బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ప్రమాదకరంగా మలుపులు

- జాతీయ, రాష్ట్ర రహదారుల్లో అధికం
- ప్రమాదాల బారినపడుతున్న వాహన దారులు
- నివారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



రామభద్రపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా మలుపు

రామభద్రపురం: మండలంలోని జాతీయ, రాష్ట్ర రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు దూసుకెళ్తూ రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఎంతోమంది వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరెంతోమంది క్షతగాత్రులవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామభద్రపురం-బొబ్బిలి, రామభద్రపురం-రాజాం ఆర్‌అండ్‌బీ రోడ్లలో పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రయాణీకులు, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా రామభద్రపురం నుంచి బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడకు నిత్యం కొన్ని వందల కొద్దీ భారీ వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రామభద్రపురం సమీపంలోని బొబ్బిలి వెళ్లే రోడ్డులో మహీంద్రా షోరూం దగ్గరున్న మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు అతివేగంతో దూసుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం, ప్రమాద హెచ్చరికల బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతోనే ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రామభద్రపురం మలుపు వద్ద సాగునీటి కాలువలోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)



రామభద్రపురం మలుపు దగ్గర బోల్తాపడిన బొగ్గు లారీ(ఫైల్)



పంట పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్(ఫైల్)

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. తనకు నమ్మి ఎమ్మెల్యే సీటు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి, ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాసమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని, ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు తన అభినందనలన్నారు. పార్టీ కోసం, తన కోసం కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ధన్యవాదాలన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి



అంట్లవారలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని బాడంగి ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిన్నయ్యపేట, లింగాపురం, అంట్లవార గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణితో కలిసి గురువారం సందర్శించిన ఆమె.. అక్కడి ప్రీస్కూల్ నిర్వహణ, పౌష్టికాహార స్టాక్‌లు, రికార్డులు, పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. మెనూ ప్రకారం చిన్నారులకు భోజనాలు పెట్టాలని, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



జగన్నాథపురం ఆర్‌బీకే వద్ద నవధాన్యాల మిశ్రమం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రేఖ, సన్యాసినాయుడు, ఉరిటి శంకరరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం-కృష్ణాపురం రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల మిశ్రమం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతీ రైతు తన పొలంలో నవధాన్యాలు వేసుకోవాలని, దీని ద్వారా ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచి లభిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొద్దల పద్మాసత్యనారాయణ, గంట సింహాచలం, ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో తిరుమల ప్రసాద్

రామభద్రపురం: గ్రంథాయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అపారమైన విజ్ఞానం మన సొంతమవుతుందని ఎంఈవో తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం నిర్వహించిన క్విజ్ పోటీలను ఆయన గురువారం పరిశీలించారు. పిల్లలకు చదువుపై ఆసక్తి పెంచేలా శిక్షణా తరగతుల నిర్వహణ ఉండడం అభినందనీయమన్నారు. లైబ్రేరియన్ సత్యవాణి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా క్విజ్ పోటీలు, పుస్తక పఠనం, కథలు చెప్పించడం, రాయించడం వంటివి చేశామన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తూ, క్రీడల్లో నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని పూల్‌భాగ్, మహారాణిపేట ప్రాంతాలతో పాటు మండలంలోని బలిజిపేట, పిరిడి, వంతరాం, నెమలాం, పినపెంకి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ స్తంభాలు సరిచేసే క్రమంలో భాగంగా ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.


రైతు సదస్సు

రేగిడి: మండలంలోని వెంకంపేట, తునివాడ, పాతచెలికానివలస, కొత్తచెలికానివలస గ్రామాల్లో రైతు సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ.. ఖరీఫ్ సాగుకు రైతు ఎలా సన్నద్ధం కావాలి, ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. అన్ని ఆర్‌బీకేల వద్ద ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు, ఎరువులు కావాల్సిన వారు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో విజయలక్ష్మి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తున్న ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు గురువారం తెలిపారు. ఇప్పటికే పైపులైన్‌ను విశాఖపట్నం నుంచి తెప్పించామని, దాని వెల్డింగ్ పనులు పూర్తి చేసిన వెంటనే పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. అమ్మవారి కాలనీ, మెంటిపేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, మాదిగ వీధి, బొబ్బిలి రోడ్డు, తెలగవీధి, చాకలివీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, మల్లిఖార్జునకాలనీ, లచ్చయ్యపేట ప్రాంతాలకు మాత్రమే నీటిని నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని ప్రజలను కోరారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు



నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అందరికీ ఆర్‌ఓ నూకరాజు ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటినుంచి నామినేషన్లు, ప్రచారం, పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్నివర్గాల ప్రజలు సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎలక్షన్ డీటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించండి

- ఎంఈఓ పాపినాయుడు



చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ పాపినాయుడు, తదితరులు

పూసపాటిరేగ : బడిఈడు ఉన్న దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బి. పాపినాయుడు అన్నారు. మండలంలోని పూసపాటిపాలెంలో విద్యాశాఖ – సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలు సాధారణ పిల్లలతో సమానంగా కలిసి విద్య నేర్చుకోవాలన్నారు. వీరికి పాఠశాలల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లల కోసం ప్రత్యేక కేంద్రం నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్కడ ప్రత్యేక ఉపకరణాలతో బోధన చేపట్టడంతో పాటు ప్రతి వారం ఫిజియోథెరపీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఎన్. బంగారునాయుడు, ఎం. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజ్

వంగర: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమైన ఆయన.. ఖరీఫ్ సాగు పనులకు ముందే సాగునీటి ప్రవాహం జోరుగా సాగేలా ప్రధాన కాలువలు, పిల్లకాలువలను బాగు చేయాలన్నారు. పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు. ఫారంపాండ్‌ల నిర్మాణం, ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీవో హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యం

- 14వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ప్రసూన్ పాండా



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ప్రసూన్ పాండా

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని 14వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ప్రసూన్ పాండా అన్నారు. స్థానిక పట్టణంలోని సన్ స్కూల్ ఆవరణలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమనేది ఎన్‌సీసీలో ప్రధాన భాగమన్నారు. విద్యార్థులతో పాటు ప్రజలు కూడా మొక్కలు నాటేందుకు ఉత్సాహం చూపాలన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి సంరక్షించాలన్నారు. అడవుల శాతం రోజురోజుకూ తగ్గుతుండడంతోనే వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. భవిష్యత్ తరాల బాగు కోసం మనమంతా కలిసి మొక్కలు నాటి, వాటిని కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు కొత్తా సాయి, పెంకి చైతన్య, మానవతా సంస్థ అధ్యక్షుడు అచ్యుత్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ నాయుడు, ప్రిన్సిపాల్ వై.భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు



విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

రేగిడి: మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ట్రాన్స్ కో ఏఈ అప్పన్న.. లైన్‌మెన్లు, సచివాలయ జేఎల్ఎంలతో కలిసి వన్నలి గ్రామం నుంచి ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ గ్రామాలకు వెళ్లే విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను గురువారం తొలగించారు. వర్షాలు సమయంలో వీచే భారీ ఈదురుగాలులకు చెట్లకొమ్మలను తాకుతున్న విద్యుత్ వైర్ల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, ఇకపై ఆ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన



పిల్లలతో ఇంగ్లిష్ పదాలు రాయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లిష్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి విద్యార్థులకు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై గురువారం అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివించడం, రాయించడం, వాటి అర్థాలు చెప్పడం వంటివి చేయించారు. స్పోకెన్ ఇంగ్లిష్ బాగా నేర్చుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచి ఇంగ్లిష్ మాట్లాడడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం పుస్తకాల ప్రదర్శన చేపట్టి, చిన్నారులతో కప్పగెంతులు ఆట ఆడించారు. కార్యక్రమంలో పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300



వావిలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని తాటిపాడు, వావిలవలస గ్రామాల్లోని మంచినీటి కోనేరుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనదారులు రెండు పూటలా పనులు చేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. వేరే వారి పేరు మీద ఇతరులను పనిలోకి రానివ్వద్దన్నారు. వడదెబ్బ బారినపడకుండా ఉండాలని, వర్షాలు కురిసే సూచనలు కనిపించినప్పుడు వెంటనే ఇంటికి వెళ్లిపోవాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఆలోచించు మిత్రమా...

ఎంతో జాగ్రత్తగా ప్రయాణం చేస్తేనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ వాహనదారులు నిర్లక్ష్యం వీడడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు చేయడం.. హెల్మెట్ ధరించకపోవడం.. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చేస్తున్నారు. కళ్లముందే ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా వారిలో మార్పు రావడం లేదు. గురువారం జిల్లా కేంద్రంలో వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం పలువురిని గగుర్పాటుకు గురిచేసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కోట ప్రాంతంలో సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తున్న వాహన చోదకుడు





రింగ్‌రోడ్డులో ప్రమాదకర ప్రయాణం



హలో...హలో అంటూ వాహనం నడుపుతున్న చోదకుడు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com